క్లుప్తంగా

కనకదుర్గమ్మకు ఎమ్మెల్యే దంపతుల పూజలు



ఈతకోట కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దంపతులు

రావులపాలెం: మండలం ఈతకోటలో వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా జరిగిన సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జగ్గిరెడ్డి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అలీ అస్గర్‌కు కన్నీటి నివాళి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు అలీ అస్గర్‌కు శుక్రవారం ముస్లింలు కన్నీటితో నివాళులర్పించారు. అర్బయీన్ కార్యక్రమాల్లో భాగంగా అలీ అస్గర్ ఊయలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. నగరం పెద పంజీషా నుంచి మంజిలే కర్బలా వరకు ఈ ఊరేగింపు జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పలు భక్త బృందాలు ముస్లిం సోదరులకు ప్రసాదాలు వితరణ చేశాయి. గురుహే తాజ్‌దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మత ప్రబోధకుడు యూసఫ్ అహ్మద్ మషద్దీ మజ్లిస్ ఆలపించారు. భారీ సంఖ్యలో ముస్లింలు ఊయల ఊరేగింపులో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై చైతన్యం తీసుకురండి



ఉత్తమ వలంటీర్ వెంకటరమణను సన్మానిస్తున్న చైర్మన్ ఆదిత్యకుమార్

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలని పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్ పిలుపునిచ్చారు. ఉత్తమ వలంటీర్ అవార్డు అందుకున్న కొల్లాబత్తుల వెంకటరమణను మామిడికుదురులో శనివారం ఘనంగా సత్కరించారు. సభలో ఆదిత్యకుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కంచి శ్రీరామ్, పార్టీ నేతలు నయినాల రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ సిర్రా మణికుమార్, సచివాలయ కన్వీనర్ చెల్లుబోయిన మోహినీదుర్గ, ఉచ్చుల విష్ణు, అనిశెట్టి రాజు పాల్గొన్నారు.

రోగుల వివరాలు నమోదు చేయాలి

అంబాజీపేట: మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గామంలో ప్రతి ఇంటిని సర్వే చేస్తూ రోగుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని వైద్యాధికారులు వి.గౌతమి, బి.కె.శ్రీనివాస్, ఎంపీడీఓ కె.సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఏఎన్‌ఎంలకు, ఆశాలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రారంభమవుతుందన్నారు. అందుకు గాను వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌ఓలు ఇంటింటికీ తిరిగి రోగులను గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో తేదీల వారీగా ప్రత్యేక వైద్య నిపుణులతో శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్యాధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓలు పర్యవేక్షణలో రోగుల సర్వే నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉచిత ఇన్సూరెన్స్‌పై అవగాహన

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లుకు, గృహసారథులకు ఉచిత ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వై.చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సూచనలతో జగనన్న కన్వీనర్ల సారథి (జేసీఎస్) మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఆయన పలువురు గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు ఉచిత ఇన్సూరెన్స్ నమోదు దరఖాస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాజోలులో వైఎస్సార్ సీపీ గెలుపుతో రాష్ట్రంలో మరో పర్యాయం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చేటట్టు కృషి చేయాలని సూచించారు. సచివాలయ కన్వీనర్లు కొల్లాబత్తుల చిట్టిబాబు, బ్రోనోలా, గన్నాబత్తుల సత్యనారాయణ, గృహ సారథులు, నాయకులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిని తలచి.. మనసారా కొలిచి

- ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు



ర్యాలి ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



అంతర్వేది రాజ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

మామిడికుదురు: శ్రావణ శుక్రవారం సందర్భంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ముత్తైయిదువులు వరలక్ష్మీదేవి పూజకు హాజరయ్యారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కోలాహలంగా మారింది. సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాల్లో భాగంగా పలు పూజలను వేద పండితులు మద్దాలి తిరుమలశింగరాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు, జ్యోశ్యుల సోమయాజులు ఘనంగా జరిపించారు. ఆలయ ఈఓ జి.మాధవి పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, బత్తుల విజయగంగారత్నం, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలోని వివిధ అమ్మవార్ల ఆలయాల్లో శ్రావణమాసం సందర్భంగా నాలుగో శుక్రవారం కావడంతో వివిధ పూజలు నిర్వహించారు. ఊబలంక, రావులపాలెం, ఈతకోట గ్రామాల్లో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అంబాజీపేట: మహిళలు తమకు కోరిన వరాలు సిద్ధించేలా చేసుకొనే పండగల్లో వరలక్ష్మీ వ్రతాన్ని నాలుగో శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, వ్యాఘ్రేశ్వరం, ముక్కామల తదితర గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి ఉపాలయం వద్ద శ్రావణ మాసంలో నాలుగో శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ కుంకుమ పూజలు మహిళలు నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉపాలయం వద్ద స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 400 మంది మహిళా భక్తులు అర్చకుల పర్యవేక్షణలో పూజల్లో పాల్గొన్నారు. ఎటువంటి పూజా రుసుం లేకుండా అమ్మవారి రూపు, పూజా సామగ్రి, ప్రసాదం దేవస్థానం వద్ద దాతల సహకారంతో ఉచితంగా ఆలయ సిబ్బంది అందజేశారు.

ఆత్రేయపురం: శ్రావణమాస నాలుగో శుక్రవారం కావడంతో మండలంలోని గ్రామాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పలువురు పండ్లు, పూలు, మామిడాకులతో అలంకరించి వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకోగా పలువురు తమ ఆనవాయితీ ప్రకారం వరలక్ష్మి దేవీని అలంకరించి వ్రతం చేసుకున్నారు. ఆత్రేయపురంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త పాతపాటి రామాంజనేయరాజు–లక్ష్మి దంపతులు తమ స్వగృహం వద్ద అమ్మవార్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వందలాది మందికి తాంబూలాలను అందజేశారు. అలాగే వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి, ఆత్రేయపురం మల్లమ్మ, కనకమహాలక్ష్మి తదితర ఆలయాల్లో భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పి.గన్నవరం: మండలంలోని యర్రంశెట్టివారిపాలెంలో వేంచేసిన వేగులమ్మ వారి ఆలయం వద్ద శ్రావణ శుక్రవారం సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అర్చక స్వామి విస్సు బాబు నేతృత్వంలో పూజలు జరిగాయి.

అలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో నాలుగో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వైభవంగా కుంకుమపూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన ఈకార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్టికొట్టు వేడుక

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయం వద్ద శుక్రవారం దేవస్థానం ఆధ్వర్యాన శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఉట్టికొట్టు వేడుకను ఘనంగా నిర్వహించారు. స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు పూజల అనంతరం వేడుకను ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి ప్రారంభించారు. వేడుకలో స్థానిక యూత్ ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని కేరింతలు కొట్టారు. ఉట్టి కొట్టడంతో యువత పోటీపడ్డారు. ఆలయం వద్ద పండగ వాతావరణ నెలకొంది. పల్లకిలో స్వామిని కొలువుదీర్చి మంగళ వాయిద్యాలతో అర్చకులు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో ఇంటింటా స్థానికులు అరటి పండ్లు, కొబ్బరికాయలు స్వామి వారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని ఊరేగింపు

మామిడికుదురు: మేళతాళాలు, భక్తుల కోలాటం నృత్యాల నడుమ శుక్రవారం ఆదుర్రు గ్రామంలో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు ఘనంగా జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మండల శాఖ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఊరేగింపుతో సంపూర్ణమయ్యాయి. భారీ సంఖ్యలో భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో హనుమంతరావు, బ్రహ్మాజీ, భీమవరం కమిటీ భక్త బృందం పాల్గొంది.

ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం చేయాలి



ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావుకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు, నాయకులు

మలికిపురం: మలికిపురంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఏఎఫ్‌డీటీ ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలను పూర్తిగా ప్రభుత్వం పరం చేసే వరకు ఉద్యమిస్తామని ఈరోజు ఆ విద్యాసంస్థల పరిరక్షణ సమితి ప్రతిజ్ఞ చేసింది. శుక్రవారం సమితి ఆధ్వర్యంలో మలికిపురం నుంచి కత్తిమండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. న్యాయం జరిగే వరకూ పోరాడతామని అని విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం రాజోలు శాసనసభ్యులు రాపాక వరప్రసాదరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలు సీఎం జగన్ దృషికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. విద్యాసంస్థల పరిరక్షణ సమితి నాయకులు దేవ రాజేంద్రప్రసాద్, రాపాక మహేష్, పోలిశెట్టి గణేష్, తాడి సహదేవ్, తాడి రవీంద్ర, నక్క సంజయ్, జిల్లెళ్ల ఉదయ్‌కిరణ్, శశి, ఐశ్వర్య, జ్యోతి తదితరులు నాయకత్వం వహించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం



మామిడికుదురులో ఓటర్ల జాబితాపై చర్చిస్తున్న ఈఆర్వో రమణారెడ్డి

మామిడికుదురు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని, అనర్హులను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తామని జిల్లా పరిషత్ సీఈఓ, పి.గన్నవరం నియోజకవర్గ ఈఆర్వో ఎ.రమణారెడ్డి పేర్కొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ అధికారులతో ఓటర్ల జాబితాపై చర్చించారు. కొత్త ఓట్ల నమోదు, అనర్హులను జాబితా నుంచి తొలగించడం తదితర అంశాలపై మాట్లాడారు. రమణారెడ్డి మాట్లాడుతూ శనివారం ఉదయం 11 గంటలకు పి.గన్నవరం మండల రెవెన్యూ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా దీనిపై ఎప్పటికప్పుడు అధికారులను సమన్వయం చేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారని చెప్పారు. అన్ని పార్టీల నేతల అభిప్రాయాలను తీసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని రమణారెడ్డి తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: తొలగించిన ప్రతి ఓటు డాక్యుమెంట్‌ను నూరు శాతం పునఃపరిశీలన చేయాలని బీఎల్వోలకు ఆదేశించామని ఈఆర్వో రమణారెడ్డి తెలిపారు. అంబాజీపేటలో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలను ఆయన శుక్రవారం సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఇంటింటా సర్వే పూర్తి చేశామతని, కొత్త ఓటర్లకు అవకాశం, చేర్పులు, మార్పుల ప్రకియలను పక్కాగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగానే పి.గన్నవరంలో మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారు, బీఎల్వోలు ఆయన వెంట ఉన్నారు.

ఈ–పంట నమోదు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–పంట నమోదును చేయించుకోవాలని, దాని ద్వారా వచ్చే లబ్ధిని పొందాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు అన్నారు. అంబాజీపేట మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి అధ్యక్షతన సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఏడీఏ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోగా ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ పంటలో వరి, కొబ్బరి, అరటి ఇతర ఉద్యాన పంటలు అన్నీ గ్రామ వీఏఏ, వీహెచ్ఓలు నమోదు చేస్తున్నారన్నారు. అన్ని ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరిలో ఆకు నల్లి, ఆకు ముడత కొన్ని పొలాల్లో ఆశించిందన్నారు. దీని నివారణకు డైమిథోయెట్ 2 మిల్లీ లీటర్ల నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయకుమార్, ఏఈఓ డి.దుర్గారావు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై తక్షణ స్పందన

మలికిపురం: మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం తహసీల్దార్ ఆఫీస్ నందు శుక్రవారం జరిగినది. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మలికిపురం తహసీల్దార్ వీఎల్ నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ సమస్యలపై చర్చించారు. రైతులకు ఈ–క్రాప్ బుకింగ్ తక్షణమే చేయించి రైతులకు వచ్చే ప్రతి ప్రభుత్వ పథకం వర్తింపజేసేలా అగ్రికల్చర్ అసిస్టెంట్లు పనిచేయాలని తహసీల్దార్ పేర్కొన్నారు. రైతులకి కావలసిన సౌకర్యాలపై చర్చించి వాటికి పరిష్కారం తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ సూర్యనారాయణరాజు ఇరిగేషన్ అసిస్టెంట్ శ్రీనివాస్ మండల సలహా మండలి సభ్యులు చింత రాజేంద్రప్రసాద్, లస్కర్లు గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

అయినవిల్లి: ఈనెల 15లో ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి(ఏవో) వై.శోభ రైతులను కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్లో శుక్రవారం ఏవో శోభ అధ్యక్షతన వ్యవసాయ సలహా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాకిలేటి శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.వీరు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మట్టపర్తి రామారావు, ఎంపీటీసీ పశ్చిమాల సుబ్బారావు మానేపల్లి గణపతి, కన్వీనర్ పితాని పండు, మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జె.దీక్షితులు, మండల ఇరిగేషన్ అధికారి మండల హార్టికల్చర్ అధికారులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలి

కొత్తపేట: కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించి ఆ రైతులను ఆదుకోవాలని కొత్తపేట మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ అధ్యక్షత ఏఏబీ సమావేశం జరిగింది. ఏఏబీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో గత కొన్నేళ్లుగా కొబ్బరికి వివిధ తెగుళ్ల వ్యాపించి దిగుబడి తగ్గిపోయిందని, దానికను గుణంగానే ధర కూడా తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో మద్దతు ధర ప్రకటించే విషయాన్ని ఉన్నతాధికారులు ద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని చైర్మన్, సభ్యుడు కోరారు. అరటి పంటకు సంబంధించి చెట్లకు ఊతంగా వెదురు గెడలను రాయితీపై సరఫరా చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 15 నాటికి ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని రైతులను ఏఓ కోరారు. పురుగుమందులు, నానో ఎరువుల పిచికారీలో కూలీల కొరత అధిగమించేందుకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు సమకూరుస్తుందన్నారు. తొలుతగా అవిడి, కొత్తపేట, పలివెల గ్రామాల్లో రైతు గ్రూపులను ఎంపిక చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఏఏబీ సభ్యుడు ఎంకే సుబ్రహ్మణ్యం వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లను అరెస్టు చేయాలి



పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో గెలవలేమని ఒత్తిడికి గురైన టీడీపీ అధినేతలు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు పాదయాత్రల పేరుతో కార్యకర్తలను రెచ్చగొడుతూ రాష్ట్రంలో దాడులకు ఉసిగొల్పుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పి.గన్నవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, వాసంశెట్టి చినబాబు, మట్టపర్తి శ్రీను తదితరులు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో హింసను ప్రేరేపిస్తున్న తండ్రీ, కొడుకులు చంద్రబాబు, లోకేష్‌లను అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారం కోసం చంద్రబాబు, లోకేష్, దత్త పుత్రుడు కలిసి కుట్రలు పన్నుతూ రాష్ట్రాన్ని తగులబెట్టాలని చూస్తున్నారని అన్నారు. మొన్న పుంగనూరు, నిన్న భీమవరంలో టీడీపీ కార్యకర్తలు చేసిన దాడులు ఈ కుట్ర పూరిత రాజకీయాలకు పరాకాష్టగా మారాయని వివరించారు. కార్యకర్తల ముసుగులో ఉన్న రౌడీలు, గూండాలను గుర్తించి పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, కొంబత్తుల ఏసుబాబు, టీవీవీ సత్యనారాయణ, ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

సఖినేటిపల్లి: మండలంలోని వీవీ మెరకలో శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయం వద్ద సదరు సొసైటీ ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బైర్రాజు ఫౌండేషన్, కిమ్స్ ఆసుపత్రి సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు రోగులకు సేవలందించారు. శిబిరాన్ని బైర్రాజు ఫౌండేషన్ కన్వీనర్ కంతేటి వెంకట్రామరాజు ప్రారంభించారు. కంటికి, గుండెకు సంబంధించిన సమస్యలు, గైనకాలజీ డిపార్ట్‌మెంట్ సేవలు, జనరల్ చెకప్ వైద్యులు నిర్వహించారు. అలాగే బైర్రాజు ఫౌండేషన్ ద్వారా రోగులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సొసైటీ డైరెక్టర్ కడలి సువర్ణరావు, నాయకులు ఇందుకూరి సత్యనారాయణరాజు, వీరా వెంకట రామారావు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురిపై దాడి కేసు

అయినవిల్లి: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తున్న వ్యక్తిని గాయపర్చిన వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం సిరిపల్లిలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టు కొట్టు సంబరం నిర్వహిస్తున్న సందర్భంగా డ్యాన్స్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఉత్సవంగా నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన నక్కా మోహన్‌రావు సెల్‌ఫోన్‌లో డ్యాన్స్ వీడియో చిత్రీకరిస్తుండగా ఉత్సవం వద్ద పలువురు అతడిని వీడియో తీస్తున్నావు ఏమిటిరా అని అతనిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై మోహనరావు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రహదారి పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న జేసీ నూపుర్ అజయ్

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి నుంచి కె.జగన్నాథపురం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు సమస్యపై గత సోమవారం గ్రామానికి చెందిన కొంకి వెంకట్రావు తదితరులు కలసి కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, ఆర్‌అండ్‌బీ ఈఈ, జేఈ, శుక్రవారం రోడ్డు పరిశీలించారు. మూడు రోజుల్లో తాత్కాలిక మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. జేసీ వెంట తొత్తరమూడి సర్పంచ్ వార జయసావిత్రి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

రాష్ట్రంలో మహాయజ్ఞంలా సంక్షేమం



సావరంలో మహిళలకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపేందుకు సంక్షేమ పథకాలను మహాయజ్ఞంలా సీఎం జగన్ చేపట్టారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం బి.సావరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక పాల్గొన్నారు. బి.సావరం కుంపట్ల వారి మెరక, మామిడిశెట్టి వారి గ్రూపు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే రాపాక పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని, ఎంతమంది కుయుక్తులు పన్నినా రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ విజయం సాధించడం ఖాయమన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ కడియం రమాదేవి, ఎంపీటీసీలు బత్తుల హేమలత, చెల్లింగి లక్ష్మీఈశ్వరి, నాయకులు కంచి వెంకటరమణ, తిక్కిశెట్టి శ్రీనివాస్, నల్లి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

అయినవిల్లి: గ్రామంలోని మత్స్యకార కాలనీలో అంగరంగ వైభవంగా సీతారాములు ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ శ్రీరామచంద్రమూర్తి, అయినవిల్లి మండల బీజేపీ అధ్యక్షుడు కుడుపూడి శేఖర్, ఉపాధ్యక్షుడు పసర్లపూడి శ్రీనివాస్, గ్రామ సంఘ నాయకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

రావులపాలెం: మండలంలోని ఈతకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల సెంటా అవార్డు పొందిన హెచ్‌ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డిని, అలాగే బదిలీలపై వేరే పాఠశాలకు వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెంటా అవార్డు పొందిన కృష్ణారెడ్డి అలాగే బదిలీలపై వెళ్లిన రాధిక, అగస్టీన్, నాగలక్ష్మి, ఉమామహేశ్వరరావు, ఉమా, సునీత, ప్రవీణ, దుర్గాప్రసాద్‌రావు, కృష్ణప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై సమీక్ష

కొత్తపేట: 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకంపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ ఈ మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వానపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ఎస్‌బీ హర్ష మాట్లాడుతూ పథకం గురించి వివరించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఫ్యామిలీ డాక్టర్ పథకం విజయవంతంగా కొనసాగుతుందని హర్ష తెలిపారు. ఇప్పుడు గ్రామంలోనే ఉన్నత వైద్య సేవలందించేలా 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం అమలు చేస్తుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఇద్దరు వైద్యులు మాత్రమే వైద్య సేవలు అందిస్తుండగా ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకంలో స్థానిక వైద్యులు ఇద్దరితో పాటు అదనంగా మరో ఇద్దరు వివిధ వ్యాధుల స్పెషలిస్టులు కూడా ఉంటారని హర్ష తెలిపారు. ఈ పథకం కింద మొదట ఈ నెల 15న వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించగా 16 నుంచి ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు నిర్వహించి 7 రకాల టెస్టులు చేస్తారన్నారు. వ్యాధి పరిస్థితిని బట్టి తాత్కాలిక చికిత్స అందిస్తారన్నారు. అత్యవసరమైతే ఉన్నత వైద్యానికి సిఫారసు చేస్తారన్నారు. ఈ శిబిరంలో 103 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్యపావని, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో జగనన్న ఆరోగ్య సురక్షపై ఎంపీడీఓ నాతిబుజ్జి అవగాహన కల్పించారు. ఈనెల 30 నుంచి అక్టోబర్ నెలాఖరు వరుకు అన్ని సచివాలయాల వద్ద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నా భూమి–నా దేశం

మలికిపురం: బీజేపీ చేపట్టిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మలికిపురం, లక్కవరం గ్రామాల్లో నిర్వహించారు. పార్టీ శ్రేణులు ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి, స్థానికంగా మొక్కలు నాటారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి, మొక్కలు నాటారు. దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మాణ కార్యక్రమంలో మట్టిని భాగస్వామ్యం చేస్తారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శృంగారపు సూర్యప్రకాష్ రావు, మండల పార్టీ ఇంచార్జ్ మాలే శ్రీనివాస నగేష్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఇందుకూరి అచ్యుతరామరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ చాన్‌బాషా మృతి



చాన్‌బాషా (ఫైల్)

పి.గన్నవరం: గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్‌ఎంపీ వైద్యుడు మొల్లా చాన్‌బాషా (60) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వైద్యం పరంగా పి.గన్నవరం పరిసర ప్రాంతాల ప్రజలకు చాన్‌బాషా విశేష సేవలు అందించారు. ఆయన మృతికి పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, వాసంశెట్టి కుమార్, నల్లా పెదకాపు, కొండా భాస్కరరావు, బొరుసు చంద్రశేఖర్, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, తోట రామకృష్ణ, రావూరి సత్యనారాయణ తదితరులు చాన్‌బాషా కుటుంబ సభ్యులను పరామర్శించారు.